ప్రజాశక్తి

గురువారం 25 సెప్టెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

డేంజర్ బెల్స్

- విష్యజర్వాల విజృంభణ
- ఇంటికొకరు బాధితులు
- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- వైద్యానికి వేలాది రూపాయల ఖర్చు
- జర్వాల కట్టడికి చర్యలు డిఎంహెచ్ఒ

కొండపిలో జర్వంతో మంచం పట్టిన తల్లీ కొడుకు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లాలో సీజన్ వ్యాధులు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. సాధారణ జ్వరాలతో పాటు విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంటికొక జ్వర పీడితుడు ఉన్నారంటే జ్వరాల పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జ్వర పీడితులతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్ కిటకిటలాడుతున్నాయి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా ప్రజలు జర్వాలతో మంచం పట్టారు. సీజనల్ వ్యాధులకు చికిత్స చేయించుకునేందుకు వేలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. జ్వరం కట్టడి అవుతున్నా నీరసం వారం నుంచి పది రోజుల పాటు ఉండటం ప్రజలను ఆందోళన కలిగిస్తోంది.

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈఏడాది సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. సాధారణ జ్వరాలతో పాటు విష జ్వరాలు, టైపాయిడ్, డయేరియా, చికున్ గున్యా, డెంగీ జర్వాలు తీవ్ర స్థాయిలో ప్రబలుతున్నాయి. కలుషిత నీరు, పారిశుధ్య నిర్వహణ, దోమల వృద్ధి, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత లోపించిన కారణంగా సీజనల్ వ్యాధులు విజృంభణకు కారణాలుగా కనిపిస్తున్నాయి.

వైరల్ ఫీవర్స్ లక్షణాలు ఇవీ...

వైరల్ ఫీవర్స్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైరల్ ఫీవర్స్‌లో ప్రధానంగా 102 నుంచి 105 డిగ్రీల తీవ్రమైన జ్వరం వస్తుంది. వైరల్ ఫీవర్స్‌లో వైరస్ బలపడటం కారణంగా తీవ్రమైన జ్వరం, ఒంటి నొప్పులు ముక్కు నుంచి నీరు కారటం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. జ్వర పీడితులు మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కిటకిటలాడుతున్న హాస్పిటల్స్

సాధారణ జ్వరాలతో పాటు వైరల్ ఫీవర్స్

▶ 2లో

అధికారులు లేక.. పాలన సాగక..

- ముఖ్యశాఖలకు ఇన్‌ఛార్జులే దిక్కు
- కుంటు పడుతున్న అభివృద్ధి
- నేటికీ జిల్లా కార్యాలయాలు ఏర్పాటు కాని వైనం

బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా ఏర్పడి మూడున్నరేళ్ళు గడుస్తోంది, పాలనా సౌలభ్యం, ప్రజలకు త్వరితగతిన ప్రభుత్వ సేవలు, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా జిల్లాను ఏర్పాటు చేశారు. ప్రకాశం జిల్లా నుంచి మూడు నియోజక వర్గాలు, గుంటూరు జిల్లా నుంచి మూడు నియోజక వర్గాలను కలిపి ఆరు నియోజక వర్గాలతో బాపట్ల జిల్లాను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ నేటికీ కూడా కొన్ని జిల్లా కార్యాలయాలు ఏర్పాటు కాలేదు. కీలక శాఖలకు పూర్తిస్థాయిలో అధికారులు లేరు. ఉన్న అధికారులు కూడా పక్క జిల్లాల నుంచి వచ్చి పోతున్నారే తప్ప స్థానికంగా ఉంటున్న వారు లేరనే చెప్పాలి. ముఖ్య శాఖలకు పూర్తిస్థాయిలో జిల్లా అధికారులు లేకపోవటంతో సంక్షేమం, అభివృద్ధి పనులు, పౌరసేవలపై ప్రభావం పడుతుంది. జిల్లాలో సంయుక్త కలెక్టరుగా పని చేసిన ప్రఖర్ జైన్ నుంచి బదిలీ వెళ్లారు. దాదాపు మూడు నెలలపాటు జేసీ నియామకం జరగలేదు. కొంత కాలంగా డిఆర్ఒ గంగాధరగౌడ్ ఇన్‌ఛార్జీగా వ్యవహరిస్తున్నారు. జిల్లా పోలీస్ శాఖలో అడిషనల్ ఎస్‌పి పోస్టు కూడా చాలా కాలంగా ఖాళీగా ఉంది. గ్రామీణాభివృద్ధిశాఖ పీడి పోస్టులో ఎవరు కూడా నిలకడగా పనిచేసిన పరిస్థితి లేదు. మూడున్నర ఏళ్ళలో ఆరుగురు పీడీలు మారారు. ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ లవన్న ఇన్‌ఛార్జి పీడీగా వ్యవహరిస్తున్నారు. అతి ముఖ్యమైన పంచాయతీరాజ్ ఎస్ఇ పోస్టు కూడా ఇన్‌ఛారి చేతిలోనే ఉంది. జిల్లా పంచాయతీ ఇంజినీరింగ్ అధికారిగా పనిచేసిన హరేరామకృష్ణ గత అక్టోబరులో మరణించారు. అప్పటి నుంచి పూర్తిస్థాయి అధికారి నియామకం జరగలేదు. పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో రూ. కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులపై పర్యవేక్షణ లేకుండా పోయింది. రోడ్లు, భవనాల శాఖ పరిస్థితి

▶ 2లో

దగ్గుబాడు ఎన్ఎస్‌పి కెనాల్‌కు గండి

▶ 4లో

ఒంగోలులో స్వల్ప భూకంపం

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలో మంగళవారం అర్ధరాత్రి 2:53 గంటల సమయంలో భూమి స్వల్పంగా కంపించింది. ఇస్లాంపేట, సత్యనారాయణపురం, దిబ్బల రోడ్డు అన్నవరపుపాడు, మంగమూరు రోడ్, పేర్నమిట్ట, సీతారామపురం, అంజయ్య రోడ్ ప్రాంతాలలో భూమి స్వల్పంగా కంపించినట్లు స్థానికులు తెలిపారు. ఆ సమయంలో వీధి కుక్కలు అరుస్తూ పరుగులు తీసినట్లు తెలిపారు. ఎలాంటి ఆస్తినష్టం జరగలేదు. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 3.4 తీవ్రతతో కంపనాలు నమోదైనట్లు జాతీయ భూకంపన అధ్యయన కేంద్రం పేర్కొంది.

జమ్ము కాశ్మీర్‌లో జవాన్ మృతి

▶ 4లో

ఆలోచన ఘనం.. ఆచరణ శూన్యం..

- మూత పడిన ఆర్‌బికెలు
- నిరుపయోగంగా మారిన డిజిటల్ కియోస్కులు
- ఇక్కట్లకు గురవుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రైతుల ఇంటి వద్దకే సేవలందించేందుకు రాష్ట్రప్రభుత్వం రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆచరణలో అది నెరవేరడం లేదు. గత ప్రభుత్వ హయాంలో భూసారం నుంచి వాతావరణం, విత్తనం నుంచి అమ్మకం, పాడి నుంచి పంట వరకు అన్ని వేళలా, అన్ని విధాలా రైతన్నలకు అండగా ఉండేందుకు కోసం గ్రామాల వారీగా జిల్లాలో 410 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో ప్రస్తుతం 84 కేంద్రాలు మూతపడ్డాయి. చీరాల నియోజకవర్గంలో అత్యధికంగా 33 రైతు సేవా కేంద్రాలు మూత పడ్డాయి. రైతులు పంటల సాగు మొదలు పెట్టిన దగ్గర నుంచి పండించిన పంటలకు కనీస మద్దతు ధర లభించే వరకూ అన్ని విషయాల లోను పూర్తి సహకారం కోసం రాష్ట ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలను తెచ్చింది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా రైతు సేవా కేంద్రాలు వచ్చాయి. రైతులు సాగు మొదలు పెట్టిన సమయంలో భూసార పరీక్షల నుంచి పంట సాగులో మెళకువలు తెలియజేయడం, రైతులకు అవసరమైన సమగ్ర సాంకేతిక పరిజ్ఞానం అందించడం, యంత్ర సామగ్రిని అందజేయడం, వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు రైతుల వద్దకు చేరేలా చూడడం రైతు సేవా కేంద్రాల ముఖ్య ఉద్దేశం. రైతాంగం పొలం బాట పట్టడానికి ముందు గ్రామాలవారీగా భూసార పరీక్షలు నిర్వహించాలి. పంటల సాగుకు ఇది కీలకం. పంట ప్రారంభానికి ముందు మట్టి నమూనాల సేకరించి భూమిలో ఏపోషకాలు

▶ 2లో

నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- ప్రతి నీటి బొట్టూ ఉపయోగపడేలా చర్యలు
- కలెక్టరేట్‌లో శాశ్వత కమాండ్ కంట్రోల్ రూమ్
- జిల్లా కలెక్టర్ రాజాబాబు

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రతి నీటిబొట్టు జిల్లా ప్రజలకు ఉపయోగపడేలా నీటి సరఫరా, నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దష్టి పెట్టాలని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ఆదిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. నీటిపారుదల, ప్రాజెక్టుల అధికారులతో కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం ప్రత్యేకంగా సమీక్షించారు. జిల్లాలోని వివిధ తరహా జలాశయాలు, వాటి నిలువ సామర్థ్యం, ప్రస్తుతం నిల్వ ఉన్న నీళ్ల పరిమాణం, వాటి పరిధిలోని ఆయకట్టు వివరాలను ఇరిగేషన్ ఎస్ఇ వరలక్ష్మి కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలోని ప్రధానమైన వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టుల నిర్మాణ స్థితిగతులు, నిర్వహణ తీరును ప్రాజెక్టుల ఎస్ఇ అబూత్ అలీం తెలియజేశారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిస్థితుల దష్ట్యా నాగార్జునసాగర్ నీటిని, స్థానిక జలాశయాల్లోని నీటిని సమర్థంగా వినియోగించుకోవాల్సి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలకు సంబంధించిన సేవలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేలా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా శాశ్వత ప్రాతిపదికన కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నీటి వనరుల నిర్వహణను

▶ 2లో

అధికారులులేక .. పాలన సాగక..

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఇంతే. ఈ కార్యాలయం తెనాలిలో ఉంది. జిల్లా కేంద్రం బాపట్లలో వసతులు లేవని ఈ కార్యాలయాన్ని అక్కడికి తరలించలేదు. ఈ శాఖ కూడా ఇన్‌ఛార్జి చేతిలోనే ఉంది. కృష్ణా పశ్చిమ డెల్టా, సాగర్ కుడి కాలువ, జిల్లాలోని ఎత్తిపోతల పథకాలు, మైనర్ ఇరిగేషన్ విభాగాలకు జిల్లా స్థాయి అధికారులు లేరు. ఈ శాఖల పరిధిలో సుమారు ఐదు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఇప్పటివరకు జిల్లాలో జలవనరులశాఖ సర్కిల్ ఏర్పాటు కాలేదు. జలవనరుల శాఖపై నిర్వహించే సమీక్షకు గుంటూరు నుంచి ఎస్ఇ, తెనాలి నుంచి ఇఇ, ఒంగోలు నుంచి ఎస్ఇ బాపట్ల వస్తున్నారు. డ్రైనేజి వ్యవస్థ ముఖ్యమైనది. లక్షల ఎకరాలు వరదముంపుకు గురికాకుండా చూడాల్సిన భాధ్యత ఈ శాఖపై ఉంది. చీరాల, తెనాలిలో డ్రైనేజి డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి. నేటికీ జిల్లా మొత్తం పర్యవేక్షించే అధికారి, కార్యాలయం బాపట్లలో లేదు. జిల్లా పరిషత్‌కు సంబంధించి విభజన జరగనందున ఏవైనా సమీక్షలు ఉంటే ఒంగోలు, గుంటూరు నుంచి డిప్యూటీ సిఇఒలు హాజరవుతున్నారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండ్ దేవదత్తు గతంలో జిల్లా కలెక్టర్ సరెండర్ చేశారు.ఇన్‌ఛార్జిగా ఉన్న వెంకటేశ్వర్లు బార్ల లైసెన్స్ విషయంలో సక్రమంగా వ్యవహరించలేదంటూ హెడ్‌క్వార్టర్స్‌కు పిలిపించారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి చేతిలోనే ఈ శాఖ ఉంది. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అనారోగ్య కారణాలతో సెలవులో ఉన్నారు. ఇన్‌ఛార్జి తోనే వ్యవసాయశాఖను నడిపిస్తున్నారు.కార్మికశాఖ జిల్లా కార్యాలయం ఏర్పాటు కాలేదు.తెనాలి నుంచే ఈ శాఖని పర్యవేక్షిస్తున్నారు.జిల్లాలో 103 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది.టూరిజం అభివృద్ధి కోసం పలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ శాఖకు జిల్లా అధికారి లేరు. సమగ్రశిక్ష జిల్లా అధికారిగా ఎం.నాగిరెడ్డి ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. బీసీ, ఎస్‌సి కార్పొరేషన్లకు జిల్లాలో కార్యాలయాలు, అధికారులు లేరు. ప్రకాశం జిల్లా అధికారులే బాపట్ల జిల్లా కూడా చూస్తున్నారు. వికలాంగుల సంక్షేమ శాఖ కూడా ఇన్‌ఛార్జి పర్యవేక్షణలో ఉంది. జిల్లా రిజిస్ట్రేషన్స్ శాఖ, ట్రెజరీ, ఆడిట్ శాఖల జిల్లా అధికారులు జిల్లా కేంద్రంలో కొద్దిరోజులు కూడా పనిచేసిన పరిస్థితి లేదు. పలు కీలక శాఖలకు అధికారులు లేరు. పోస్టులు ఖాళీగా ఉన్నా కొత్త వారితో భర్తీ చేయటం లేదు. గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన అదే శాఖల అధికారులను ఇన్‌ఛార్జులుగా నియమించి కాలం గడుపుతున్నారు. జిల్లాలో ఉన్న పలువురు అధికారులు కూడా అయిష్టంగానే ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో జిల్లా పరిపాలన కుంటుపడుతుంది.

డేంజర్ బెల్స్

(మొదటిపేజీ తరువాయి)

విజృంభించటంతో ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్ కిటకిటలాడుతున్నాయి. వైరల్ ఫీవర్స్ నివారణకు అవసరమైన చికిత్స కోసం ప్రజలు వేలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌లో వైరల్ ఫీవర్స్ నివారణకు రూ.5 వేలు నుంచి 10 వేల వరకు వెచ్చించటం గమనార్హం. జిల్లా కేంద్రమైన ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జ్వర పీడితుల ఓపి రోజు రోజుకి పెరుగుతోంది. గతం వారం రోజులలో 150- 200 మంది జ్వర పీడితులు వస్తుండగా, బుధవారం ఓపి 350 నుంచి 500 వరకు పెరగటం జ్వరాల విజృంభణకు నిదర్శనంగా కనిపిస్తోంది.

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ గణాంకాలివీ...

సాధారణ, వైరల్ ఫీవర్స్, డెంగీ, చికున్ గున్యా వ్యాధుల వాస్తవ పరిస్థితికి , జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ గణాంకాలకు పొంతన లేకుండా పోతోంది. సాధారణ జ్వరాలు 1,72,584 కేసులు, టైఫాయిడ్ 676 కేసులు నమోదయ్యాయి. డయేరియా కేసులు 3564 కేసులు కాగా ఇందులో ఎఆర్ఐ కేసులు 5429, ఎస్ఎఆర్ఐ కేసులు 147 నమోదయ్యాయి. డెంగీ కేసులు 51 కేసులు, మలేరియా 27 కేసులు నమోదయ్యాయి. జిల్లాలో చికున్ గున్యా అనుమానిత కేసులు 115 నమోదు కాగా ఇందులో 8 కేసులు పాజిటివ్‌గా తేలాయి.

విష జ్వరాల కట్టడికి చర్యలు

డాక్టర్ టి వెంకటేశ్వర్లు, డిఎంహెచ్ఒ

కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు వైరల్ ఫీవర్స్ కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం. పిహెచ్‌సి, సిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల పరిధిలో విష జ్వరాలు ప్రబలిన చోట ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాం. సీజనల్ వ్యాధులు ముఖ్యంగా వైరల్ ఫీవర్స్ అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాలు అందించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉంది.

'ఓట్ చోరీ'పై సంతకాల సేకరణ

ప్రజాశక్తి-మార్కాపురం

సభ్యత్వం చేర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓట్ చోరీపై కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ చేపట్టింది. మార్కాపురం పట్టణంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్‌ఖాన్ సారథ్యంలో సంతకాల సేకరణ బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి యువత నుంచి స్పందన లభించింది. ఎన్నికల్లో ముమ్మాటికీ గోల్‌మాల్ జరిగిందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఈ సందర్భంగా ఇమ్రాన్‌ఖాన్ మాట్లాడుతూ మార్కాపురం మున్సిపాలిటీలో పదివేల సంతకాలు సేకరించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మహబూబ్‌వలి, మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టరును కలిసిన ఎమ్మెల్యే బిఎన్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

కలెక్టరుతో ఎమ్మెల్యే బిఎన్

ఒంగోలులో జిల్లా కలెక్టరేట్‌లో ప్రకాశం జిల్లా నూతన కలెక్టర్ పి రాజాబాబుని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల గురించి కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు.

నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రకాశం జిల్లా వాటర్ మేనేజ్‌మెంట్ సిస్టం పేరుతో ప్రత్యేకంగా ఓయాప్‌ను తయారు చేయాలన్నారు. వివిధ జలాశయాలను జియో కోఆర్డినేటర్స్ ఆధారంగా ఈ యాప్ తో అనుసంధానం చేయాలన్నారు. తద్వారా ఆయా నీటి వనరులలో నిల్వ వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని జలవనరుల శాఖలో పనిచేసే ఉద్యోగులు, ముఖ్యంగా క్షేత్రస్థాయి సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. మైనర్ చెరువుల్లోని మట్టిని స్థానికులు ఉచితంగా తీసుకువెళ్లేందుకు అనుమతించేలా ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. నాగార్జునసాగర్ కాలువ ద్వారా దర్శి నుంచి పొదిలికి మంచినీళ్ల సరఫరా చేసేలా పైపులైన్ల పనులు త్వరగా పూర్తిచేసేలా సంబంధిత కాంట్రాక్టర్ తో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తాగు, సాగునీటి వనరుల నిర్వహణలో ఇరిగేషన్, ప్రాజెక్టులు, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బాల శంకరరావు, ఇరిగేషన్, ప్రాజెక్టుల ఇఇలు, డిఇలు, భూగర్భ నీటివనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వందనం, ఎపిఎస్ఐడిసి అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్ రమణబాబు

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాజబాబును మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కమిషనర్‌తో మాట్లాడుతూ గిద్దలూరు మున్సిపల్ ఆదాయం పెంపునకు కృషి చేయాలని, అలాగే పట్టణంలో తాగు నీరు, పారిశుధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఇంకా పలు సూచనలిచ్చారు.

ఘనంగా బాలు స్వరాభిషేకం

ప్రజాశక్తి-పొదిలి

గాన గంధర్వుడు, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత దివంగత ఎస్పీ బాలసుబ్రమణ్యం ఐదవ వర్ధంతి సందర్భంగా స్థానిక సాయి బాలాజీ కళ్యాణ మండపంలో బాలు పాటల స్వరాభిషేకం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా పలువురు తమ స్వరాలతో పలు పాటలను పాడి అలరించారు.

టీడీపీ నాయకుడు 'వరికుంట' మృతి

వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పొదిలి: పొదిలి పట్టణ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ కార్యదర్శి, గాండ్ల సంక్షేమ సంఘం నాయకులు వరికుంట వెంకటేశ్వర్లు(60) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొద్ది రోజులుగా ఒంగోలు సంఘ మిత్రలో వైద్య సేవలు అందుకున్న వెంకటేశ్వర్లు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఈరోజు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటేశ్వర్లు మరణ వార్త తెలిసిన పలువురు పట్టణ ప్రముఖులు రథం రోడ్‌లోని ఆయన నివాసానికి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమార్తె, ఉన్నారు. గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎంపీడీవోగా బాలచెన్నయ్య

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఏ బాలచెన్నయ్య

మార్కాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి గా ఏ బాల చెన్నయ్య బుధ వారం ఎంపీడీవో కార్యా లయంలోని ఎంపీడీవో ఛాంబర్‌లో ఉద్యోగ బాధ్యత లు చేపట్టారు. ముందుగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో బాలచెన్నయ్యకు సిబ్బంది పూలమాల లతో, బొకేలతో స్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా ఎంపీడీవో బాల చెన్నయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సత్వరమే అందేలా కృషి చేస్తానన్నారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ, పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏవో భాగ్యవతి, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు నూతన ఎంపీడీవోను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No: 56/2025

రావిపాటి హనుమంతరావు ...... వాది

Vs

సుంకర హుస్సేన్ రెడ్డి వగైరా ..... ప్రతివాదులు

నోటీసు

D5) పాకనాటి రమణ D/o వెంకటరమణారెడ్డి
తాళ్లూరు గ్రామం మరియు మండలం,
ప్రకాశం జిల్లా.

పై దావాలో వాది చనిపోయిన చేవూరి అంజిరెడ్డి ప్రాంసరీ నోటు బాకీ రాబట్టుకొను నిమిత్తం మీపై దావా దాఖలు చేసియున్నారు. మీకు ఎన్నిసార్లు నోటీసు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసు జారీ నిమిత్తం వాయిదా 18-11-2025 తేదికి వేసియున్నారు. ఆరోజు ఉదయం 10.30 ని:లకు మీరు స్వయంగా గానీ, ప్లీడర్ ద్వారా గానీ హాజరు పడి మీ ఆక్షయ పనులు తెలపగలరు. లేనియెడల మీ పరోక్షమందు దావా తీర్మానించబడునని తెలియపరచడమైనది.

వాయిదా తేది : 18-11-2025

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

అద్దంకి **ఇట్లు**
తేది :24-09-2025 **కరి రామకృష్ణారావు**
B.A.,L. L. B
వాది తరుపున అద్వకేట్
సెల్ నెం :98492 35720

ఆలోచన ఘనం.. ఆచరణ శూన్యం

(మొదటిపేజీ తరువాయి)

లోపించాయో తెలుసుకుని తదనుగుణంగా ఎరువులు వినియోగించాలి. రైతు సేవా కేంద్రాలు అందుబాటు లోకి వచ్చాక కొంత మేర భూసార పరీక్షలు నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల్లో డిజిటల్ కియోస్కలను ఏర్పాటు చేశారు. ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దిన ఈ పరికరం ద్వారా రైతులు తమకు కావాల్సిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ఇతర వ్యవసాయ ఉత్పాదకాలను తమ గ్రామం నుంచే ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసి పొందవచ్చునని చెప్పారు. పంటల సాగులో నూతన పద్ధతులను ఇక్కడి వీడియోల ద్వారా చూడవచ్చునన్నారు. పాత రెవెన్యూ గ్రామా లను ప్రాతిపదికగా తీసుకుని వీటిని ఏర్పాటు చేశారు. డిజిటల్ కియోస్కలు ఎక్కడ కూడా రైతులకు అంతగా ఉపయోగపడిన దాఖలాలు లేవు. ఇప్పుడు రైతు సేవా కేంద్రాలే మూతపడడంతో డిజిటల్ కియోస్కలు నిరుపయోగంగా మారాయి. మండలాల వారీగా రైతులను గ్రూపులుగా చేసి వారికి రాయితీతో కూడిన వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేందుకు రైతు సేవా కేంద్రాల ద్వారా వీలు కల్పించారు.గ్రామం యూనిట్‌గా ఏర్పాటు చేసిన రైతు గ్రూపులకు రూ 15 లక్షల విలువైన పరికరాలు అందజేశారు. ట్రాక్టర్లు, నాగళ్ళ, నూర్పిడి యంత్రాలను రైతులు కొనుగోలు చేయవచ్చు ఈ పనులన్ని రైతు సేవా కేంద్రాలలోని గ్రామ వ్యవసాయ సహాయకులు చేసేవారు. రైతులకు అవరమైన బ్యాంకింగ్ సేవలు కూడా రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చిన దాఖలాలు లేవు. పలు రకాల కారణాలతో రైతులకు గడప వద్దనే సేవలందించే ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాలు ప్రభుత్వం చెప్పిన విధంగా రైతులకు చేరువ కాలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా రైతు సేవా కేంద్రాలు తమకు మరింత ఉపయోగకరంగా ఉంటాయని రైతులు ఆశపడ్డారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన రేషనలైజేషన్ కారణంగా జిల్లాలోని 84 రైతు సేవా కేంద్రాలు రద్దు అయ్యాయి. జిల్లాలో మిగులుగా ఉన్న వివిఎలు, విహెచ్‌ఎలు, విఎస్‌ఎలు ఇతర జిల్లాలకు వెళ్లిపోయారు. చీరాల, బాపట్ల ప్రాంతాల్లో సాగు భూమి విస్తీర్ణం తక్కువగా నమోదు కావడంతో జిల్లాలోని 410 రైతు సేవా కేంద్రాల స్థానంలో 326 మాత్రమే మిగిలాయి. జిల్లాలో ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. ఎరువుల కోసం ముఖ్యంగా యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు. యూరియా పంపిణీ కోసం గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు లేక ఇతర శాఖల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేయాల్సి వస్తుంది.

రేషనలైజేషన్ కారణంగా చీరాల నియోజకవర్గంలోని రైతు సేవా కేంద్రాలు పరిస్థితి దారుణంగా ఉంది. చీరాల మండలంలో 22 రైతు సేవా కేంద్రాలు ఉండగా 18 మూతపడ్డాయి. మండలంలో నలుగురు వివిఎలు మాత్రమే మిగిలారు. వేటపాలెం మండలంలో 19 రైతు సేవా కేంద్రాలు ఉంటే 15 మూతపడ్డాయి. ఇక్కడ కూడా నలుగురు వివిఎలు మాత్రమే ఉన్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. గ్రామాల్లో రైతులు పంట నమోదు, పంటకు తెగుళ్ళ, పంటలు ముంపుకు గరైనా, ఇతర సమస్యల గురించి తెలుకొనేందుకు రైతు సేవా కేంద్రాలకు రైతులు వెళ్లేవారు. అవి మూతపడడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతు సేవా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చి తమకు అవసరమైన సేవలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దావా సమను

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No: 65/2024

Between :

గుంజి ఆంజనేయులు మరియొకరు ..... వాదులు

Vs

కోయ అంకారావు వగైరాలు ..... ప్రతివాదులు

To

తన్నీరు శేషయ్య S/o భూషయ్య
మేదరమెట్ల గ్రామం, కొరిశపాడు మండలం,
బాపట్ల జిల్లా, అద్దంకి, డి.ఎం.సి **(7వ ప్రతివాది)**

పై నంబరు దావాను వాదులు దావా పరిహారముల నిమిత్తం దాఖలు చేసియున్నారు. సదరు దావాలో 7 వ ప్రతివాది అయిన మీరు ఇందును గూర్చి మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు దావా సమన్లు జారీ చేయవలసినదిగా శ్రీకోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చి యున్నారు. ఇందు నిమిత్తమై మీకేమైనా అభ్యంతర ములు ఉన్న యెడల 08-10-2025వ తేది ఉదయం 10.30 ని:లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, వకీల్ ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు//

అద్దంకి **ఇట్లు**
తేది :22-09-2025 **పంచాగ్నుల రమేష్**
వాదుల తరపు అద్వకేట్
అద్దంకి టౌన్, బాపట్ల జిల్లా
సెల్ నెం : 99487 88290

గ్రానైట్ పరిశ్రమపై 'సీనరేజ్' పిడుగు

ప్రజాశక్తి-చీమకుర్తి

సీనరేజి వసూలు గ్రానైట్ పరిశ్రమపై పిడుగుపాటుగా మారనుంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రానైట్ సీనరేజ్ వసూలు ఏఎమ్ఆర్ ప్రైవేట్ సంస్థకు అప్పగించిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 1 నుంచి గ్రానైట్ పరిశ్రమ మరియు దాని అనుబంధ పరిశ్రమలలో సీనరేజి వసూళ్లు ఏఎంఆర్ సంస్థ చేపట్టనున్నది.. గ్రానైట్ గనులు, పాలిషింగ్ యూనిట్లు, కంకర మిల్లులు లాంటి పరిశ్రమల నుంచి ఈ సంస్థ వసూలు చేయనున్నది. ప్రభుత్వానికి ఏఎంఆర్ సంస్థ ఏటా రూ.45 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్ దెబ్బతిని, గ్రానైట్ ఎగుమతులు మందగించి గ్రానైట్ గనుల యజమానులు మరియు పాలిషింగ్ యూనిట్ల యజమానులు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. పాలిష్ యూనిట్ల యజమానులు బ్లేడుకు రూ.27 వేల స్లాబ్ సిస్టంలో ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు. సీనరేజీ వసూలు ఏఎంఆర్ సంస్థ చేతికి రావటంతో ప్రభుత్వానికి చెల్లించే సీనరేజీతోపాటు అదనంగా పాలు సింగ్ యూనిట్లపై మరియు గ్రానైట్ గనుల యజమానులపై అదనపు వసూలు పడే అవకాశం ఉంది. ఇప్పటికే ఏఎంఆర్ సంస్థ వారు చీమకుర్తి ఏరియాలో నిఘా పెట్టడానికి చెక్ పోస్టు బాక్సులు దింపారు. ప్రతి క్వారీ ద్వారాల వద్ద బాక్సులు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. గ్రానైట్ ఏరియా మొత్తం ఏఎంఆర్ వారు ఏర్పాటు చేసే సీసీ కెమెరాల పరిధిలోకి రానున్నది. దాదాపు 200 పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారని ప్రచారం జోరుగా సాగుతోంది. పరిమితికి మించి ఎలాంటి రాయి బయటకి వెళ్లకుండా ఏఎంఆర్ నిఘా పరిధిలో ఉంటుంది. ఈ నేపథ్యంలో అటు గ్రానైట్ యజమానులలో ఇటు పాలిసింగ్ యూనిట్ల యాజమాన్లలో గుబులు ప్రారంభమైంది. ప్రశాంతంగా నడుస్తున్న గ్రానైట్ ప్రాంతంలో చెక్‌పోస్టులు సీసీ కెమెరాలు ఏర్పాటు కానుండడంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ బిల్లులు కట్టలేక, స్లాబ్ సిస్టం కిస్తీలు మరియు ఇఎంఐలు, అదనపు ఖర్చులు భారాలతో కొట్టుమిట్టాడుతున్న పాలిసింగ్ యూనిట్ల యజమానులపై ఎంత భారం మోపనున్నదో అనే భయాందోళనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఒంగోలులో ఏఎంఆర్ సంస్థ వారు గ్రానైట్ యజమానులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వానికి కట్టాల్సిన స్లాబ్ సీనరీతో పాటు అదనంగా భారీ మొత్తంలో భారం మోపటానికి సూచనలు చేసినట్లు తెలిసింది. దీంతో యజమానులు ఆందోళనలో ఉన్నారు. బుధవారం ఒంగోలులో గ్రానైట్ యజమానులతో ఏఎంఆర్ ప్రతినిధులు సమావేశమయ్యారు. సమావేశం మరో దఫా జరగనున్నట్లు తెలిసింది. ఎక్కువ భారం మోపే విధంగా నూతన విధానం అమలు ఉండే పనైతే యజమానులు ఆందోళనకు సిద్ధపడాలని సమాయత్తమవుతున్నారు.

గ్రానైట్ యాజమాన్యంతో సమావేశమైన ఏఎంఆర్ ప్రతినిధులు

పని గంటల పెంపుపై సిఐటియు నిరసన

ప్రజాశక్తి-దొనకొండ

రోజుకు ఎనిమిది గంటల పనివిధానం స్థానంలో 13 గంటల పనిని వ్యతిరేకించాలని సీఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగా రావు డిమాండ్ చేశారు. స్థానిక సివిల్ సప్లయి గోడౌన్ వద్ద మండల సీఐటియు కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన బుధవారం కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కార్మికులు ప్రాణాలర్పించి తెచ్చుకున్న చట్టం 8 గంటల పని విధానం గత 135 సంవత్సరాల నుంచి కొనసాగుతుందన్నారు. ఈ రోజు మోదీ బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్‌కోడ్ బిల్లులను తెచ్చిందన్నా రు. ఆ దారిలోనే రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో రెండురోజుల క్రితం రోజుకు 13 గంటల పనిచట్టం ఆమోదించిందని ఇప్పటి వరకు వారంలో 75 పని గంటలు ఉండగా ఇప్పుడు 144 గంటలకు పెంచటం కార్పొరేట్ కంపెనీల యాజమాన్యంకు కార్మికులను బలిచేయ టమేనని విమర్శించారు. దొనకొండ సివిల్ సప్లయి ముఠా వర్కర్స్ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఆదాం, పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దసరా బోనస్ రూ.6500, స్వీట్లు రూ.1500 మొత్తం రూ.8వేలు రావాల్సి ఉండగా రూ.7200 మంజూరు చేయటం జరిగిందన్నారు. యూనిఫాం రెండేళ్ళ క్రితం ఇచ్చారని దసరాకు పూర్తిగా బోనస్, యూనిఫాం అందించాలని అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని గోడౌన్ ఇన్‌చార్జి వాసుదేవరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూని యన్ నాయకులు డి నర్శింహరావు, పి కోటేశ్వరరావు, సుబ్బారావు, శ్రీనివాసరా వు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐటియు ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న కార్మికులు

సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సంతకాల సేకరణ

ప్రజాశక్తి-దర్శి : అసంఘటిత కార్మికుల మరియు ఉద్యోగుల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చైర్మన్ దర్శి నియోజకవర్గం సమన్వయకర్త కైపు వెంకటకష్ణారెడ్డి దర్శిలో ఓటర్ల జాబితాలో అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్త ఉద్యమంలో రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా పిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిలరెడ్డి ఆదేశాల మేరకు సంతకాల సేకరణ ఉద్యమం నిర్వహించినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త నిరసనలో భాగంగా బుధవారం దర్శి నియోజకవర్గం దర్శి పట్టణంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. వెంకటకష్ణారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం రచించిన అంబేద్కర్ విగ్రహం నుంచి ఓట్ చోరీ మీద సంతకాలా సేకరణ మొదలుపెట్టడం జరుగుతుందని, ఎలక్షన్ కమిషన్ ఓటర్ల జాబితా విషయంలో అవకతవకలు సష్టించి అనేక దొంగ ఓట్లను నమోదు చేసి ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి మండల అధ్యక్షులు రామిరెడ్డి, దర్శి మండల పరిశీలకులు ఇరికినేని వెంకటనరసయ్య, దర్శి పట్టణ అధ్యక్షులు పౌలేష్, తాళ్లూరు మండల అధ్యక్షుడు కోకట్ల వీరబ్రహ్మం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కమల్ సాయిబ్, దాసరి వెంకయ్య, వెంకటేశ్వర్లు, తిరుపతమ్మ, రమేష్, జకరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడు రమేష్ మృతికి సంతాపం

ప్రజాశక్తి చీమకుర్తి

స్థానిక సుజాత క్లినిక్ వైద్యులు డాక్టర్ కాట్రగడ్డ రమేష్ (58) మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రమేషు మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతికయాన్ని బుధవారం పలువురు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల తెలుగుదేశం అధ్యక్షుడు జి రాఘవరావు, మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాదు, తెలుగుదేశం నాయకులు కాట్రగడ్డ రమణయ్య, కందిమల్ల గంగాధర్ రావు, గొల్లపూడి కోటేశ్వరరావు, పుట్టబ్రహ్మయ్య, రావిపాటి రాంబాబు, పట్టణ టిడిపి అధ్యక్షుడు ముప్పూరు చలమయ్య,సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జిల్లా నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు తదితరులు నివాళు లర్పించారు.

పొగాకు రైతులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి-కొండపి

పొగాకు నారుమడులు పెట్టే రైతులు తప్పనిసరిగా కొండపి పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్లు చేపించుకోవాలని బోర్డు అధికారి సునీల్ కుమార్ అన్నారు. బుధవారం బోర్డు పరిధిలోని రామాయపాలెంలో ఎఫ్‌సీవి పొగా కునారు మళ్ల పెంపకం, నియం త్రణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ గత సంవత్సరంలో అధిక పరిమాణంలో పండించిన పంట వలన రైతులు వేలం కేంద్రాలలో పొగా కును అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని, దాని దష్టిలో ఉంచుకొని బోర్డు నిర్ణయించిన పంట పరిమితులోనే పొగాకు పండించాలని సూచించారు. 2025-26 పంట కాలమునకు 142 మిలియన్ కేజీలను ఉత్పత్తిని మన రాష్ట్రానికి అనుమతించినట్లు తెలిపారు. పొగాకు పంట నియంత్రణలో భాగంగా నర్సరీ దశ నుండి అన్ని నియమా నిబంధనలు అమలుపరచడానికి బోర్డు అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమం లో రామాయపాలెం ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మారెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మరెడ్డి

కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

అమెరికా ఆధిపత్యంపై కరపత్ర ప్రచారం

ప్రజాశక్తి-పీసీపల్లి : ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం వివిధ దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని సిపిఎం నాయ కులు మహేష్ అన్నారు. మన దేశ వ్యవసాయ రంగాన్ని పారిశ్రా మికోత్పత్తి, సేవా రంగాన్ని దెబ్బతీస్తుందన్నారు. బుధవారం ట్రంప్ విధానాలపై ప్రజలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ రష్యా నుండి ఆయిల్, ఆయుధాలు కొంటున్నామనే ఉద్దేశంతో మన దేశంపై 50 శాతం సుంకాలు పెంచాడని అన్నారు. ఇలాంటి చర్యలను వ్యతిరేకించాలని, ట్రంప్ విధానాలను వ్యతిరేకించే దేశాలతో కలిసి వాణిజ్య యుద్ధానికి అడ్డు కట్టు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అద్దంకి ఆనందరావు, అత్యాల మోషే, గుంటూరు అచ్చయ్య, అత్యాల అంకయ్య, కె అజయ్, వేలంగనీయులు, సామ్సన్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో చోరీ

ప్రజాశక్తి-పామూరు : పామూరు మండలం తిరుగలదిన్నె గ్రామంలోని శ్రీ వేద దక్షిణామూర్తి దేవాలయంలో గుర్తుతెలి యని వ్యక్తులు హుండీని దొంగిలించినట్లు ఎస్ఐ కిషోర్ బాబు తెలిపారు. బుధవారం దేవాలయం వద్దకు వెళ్లి విచారణ చేప ట్టారు. దొంగిలించిన హుండీని పొలాల్లో వేసి వెళ్లిపోయారు. కొత్తగా నిర్మాణం జరిగిన దేవాలయంలో భక్తులు వేసిన నగదును అపహరించినట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారన్నారు.

చెంచురామానాయుడికి నివాళి

ప్రజాశక్తి-టంగుటూరు : జరుగుమల్లి మండలంలోని చింతల పాలెం గ్రామంలో జిల్లా మార్కెటింగ్ సొసైటీ మాజీ చైర్మన్ బెల్లం సత్యనారాయణ సోదరుడు బెల్లం చెంచురామానా యుడు దశదిన కర్మ బుధవారం నిర్వహించారు. కొండపి మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, సీనియరు టిడిపి నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, టంగుటూరు మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు పోతుల నరసింహారావు బెల్లం చెంచు రామానాయుడుకి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జరుగుమల్లి టిడిపి అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, ఈదర ప్రభాకరరావు, ఏలూరి రాంబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రావెళ్ల ప్రదీప్, కొమ్మాలపాటి కృష్ణ పాల్గొన్నారు.

సురేష్‌తో మాట్లాడుతున్న నాయకులు

ఆదిమూలపు సురేష్‌కు పరామర్శ

ప్రజాశక్తి-శింగరాయకొండ : మాజీమంత్రి, కొండేపి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను బుధవా రం వైసీపీ నాయకులు పరామర్శించారు. బుధవారం తాడేపల్లి లో జగన్ సమావేశానికి హాజరైన సురేష్‌ను వైసీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ సుల్తాన్‌బాషా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జరుగుమల్లి మండల పార్టీ అధ్యక్షులు పిన్నిక శ్రీనివాసరావు కూడా కలిసి పరామర్శించడం జరిగింది. వీరి వెంట ఎస్‌కె.పటేల్, సయ్యద్ ఆబిద్‌ఆలి, అల్లాబక్షు, షేక్.అబ్దుల్లా తదితరులు ఉన్నారు.

పిచ్చయ్యకు డాక్టర్ వెంకయ్య నివాళి

ప్రజాశక్తి-శింగరాయకొండ : శింగరాయకొండ మండలం పాకల గ్రామంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కాలనీలో వైసీపీ నాయకులు యర్రమాల సుబ్బారావు తండ్రి పిచ్చయ్య(90) మరణించిన విషయం తెలియగా బుధవారం వారి భౌతికకాయానికి కొండేపి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జి, పిడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎల్ఐసి ఏజెంట్ ఎర్రమలసుబ్బారావును పూలమాల వేసి నివాళులలు అర్పించారు. వీరి వెంట ఎంపిటీసీ గొల్లమూడి అశోక్‌రెడ్డి, ఉపసర్పంచ్ బల్లెల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిపి ప్లాంట్ నిర్మాణ స్థలాన్ని మార్చాలి

అధికారులు తక్షణమే నిర్ణయం తీసుకోవాలని ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి - చీరాల

ఎస్‌టిపి ప్లాంటు నిర్మాణ స్థలాన్ని మార్చాలని కోరుతూ దళిత, ప్రజాసంఘాల నాయకులు బుధవారం నిరసన వ్యక్తం చేశవారు. దళిత వాసులు, ప్రముఖ విద్యాలయం సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు చదువుకుంటున్న దండుబాట ప్రాంతంలో మురుగునీరు శుద్ధికరణ కేంద్రం (ఎస్టిపి ప్లాంట్)ను ఏర్పాటు చేయటం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని, తక్షణమే అధికారులు పునరాలోచించి ప్లాంటును ప్రజలకు అసౌకర్యం లేని చోట నిర్మాణం చేపట్టాలని సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు అన్నారు. దండుబాటలోనే ఎస్టిపి ప్లాంట్ నిర్మాణం జరుగుతున్న స్థలాన్ని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పరిశీలించారు. తక్షణమే నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని నిరసన తెలిపారు. ఎస్టిపి ప్లాంట్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో దళిత కాలనీ వాసులు మరియమ్మపేట, జాన్‌పేట, మేరీ క్రిస్టియన్‌పేట, రోశయ్య కాలనీ ప్రాంతాల ప్రజలు నివాసం ఉంటున్నారని అన్నారు. అంతే కాకుండా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అక్కడ చదువుకుంటున్నారని అన్నారు. ఇంత మంది నివాసం ఉంటున్న ప్రాంతంలో వారి ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా, రైతుల పంట పొలాలు పాడైపోయేలా ఏర్పాటు చేస్తున్న ఎస్టీపి ప్లాంట్ కట్టడాన్ని తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. మురుగు నీరు ఎగువ ప్రాంతం నుండి దిగువ ప్రాంతానికి తరలించేందుకు అనువుగా ఉన్న చోట ప్లాంట్ నిర్మాణం జరగాలని అన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న స్థలంలో మురుగు నీరు దిగువ ప్రాంతం నుండి ఎగువ ప్రాంతానికి పంపించేలా ఉందని, దీనిని సంబంధిత అధికారులు పునరాలోచన చేయాలని అన్నారు. దండుబాట ప్రాంతంలో కాంట్రాక్టర్ ప్రయోజనాల కోసమే ప్లాంట్ నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. ప్లాంట్ ప్రయోజనాలు మాత్రం శూన్యమని అన్నారు. మురుగు నీరు పారుదలకు కేంద్రంగా ఉన్న కుందేరు కాలువ ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక మురుగు పారుదల లేక డ్రైనేజీ సమస్యతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాలకులు వాటిపై దృష్టి పెట్టకుండా ప్రకృతి సహజ సిద్ధంగా మురుగు నీరు ప్రవాహం లేని ప్రాంతంలో ప్రజలు సొమ్ము రూ.8 కోట్లతో ఆ ప్రాంతంలో వృధా ఎస్టీపి ప్లాంట్ నిర్మాణం చేయాలని, కాంట్రాక్టర్ల జేబులు నింపాలని, స్వలాభం పొందాలని అధికారులు వ్యవహరిస్తున్నారని అన్నారు. కాగా ఈ విషయాన్ని ఈపాటికే ఆర్డిఓ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని అన్నారు. మెజిస్ట్రేట్‌గా ఉన్న ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు ప్రజా సమస్యను గుర్తించి ప్లాంట్ ప్రయోజనాలు చేకూరే ప్రాంతంలో నిర్మాణం జరిపించాలని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా పట్టణ ప్రజలకు మేలు కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ఎల్ జయరాజు, సిపిఐ నాయకులు ఎ బాబురావు, ప్రజా సంఘాల నాయకులు శీలం రవి, ఊటుకూరు వెంకటేశ్వర్లు, శ్యామేలు, భగత్ సింగ్, కుమార్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

జిఎస్‌టి తగ్గింపు ఫలాలు పేదలకు అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య

ప్రజాశక్తి - పంగులూరు

జీఎస్టీ తగ్గింపు ఫలాలు పేదలకు వెంటనే అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. గురువారం పంగులూరు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం జీఎస్టీ ధరలను కొన్ని స్లాబుల వారీగా తగ్గించామని, ఈ తగ్గింపు పేదలకు ఎంతో ఉపయోగమని పాలకులు చెబుతున్నారని అన్నారు. అయితే ఆ ఫలాలు పేదలకు అందటం లేదని అన్నారు. జీఎస్టీ రేట్లును తగ్గించినప్పటికీ నిత్యవసర వస్తువుల ధరలను దుకాణాల్లో తగ్గించడం లేదని చెప్పారు. ఇదేమని వ్యాపారులను అడిగితే ప్రభుత్వం జీఎస్టీ ధరలు తగ్గించక ముందే ఈ సరుకులు తెచ్చామని, వీటిని పాతధరలకే అమ్మాలని అంటున్నారని చెప్పారు. ఇప్పుడు అమ్ముతున్న సరుకులు పాత జీఎస్టీ రేట్ల ప్రకారమే అమ్ముతున్నారని, ధరలు ఏమాత్రం తగ్గించలేదని చెప్పారు. కొత్త జీఎస్టీ ధరలు అమ్మాలంటే మరో మూడు నెలల సమయం పడుతుందని వ్యాపారాలు చెబుతున్నారని అన్నారు. మరో మూడు నెలల వరకు పాత జీఎస్టి ధరల ప్రకారం పేదలు భారాలు మోయాల్సిందేనాని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలు ఒకటి, జరుగుతున్నది మరొకటి లా ఉందని అన్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకొని కొత్త జీఎస్టీ ధరల ప్రకారం వెంటనే ధరలు మార్చి నిత్యవసర ధరలు అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రభుత్వం బర్లి పొగాకు సాగుపై నిషేధం విధించిందని అన్నారు. దీనివలన రైతులు ప్రత్యా మ్నాయ పంటలైన శనగ, మొక్కజొన్న పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో మొక్కజొన్న, శనగ విత్తనాల్లో ప్రతి ఏటా కల్తీ విత్తనాలు వస్తున్నాయని అన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు రాయిని వినోద్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. అన్నదాత సుఖీభవ, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, పంట నష్ట పరిహారాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య

దగ్గుబాడు ఎన్ఎస్‌పి కెనాల్‌కు గండి

కాలువకు గడిపడి పొలాల్లోకి వెళుతున్న నీళ్లు

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని దగ్గుబాడు గ్రామ పరిధిలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు కాలువకు గండిపడటంతో కాలువ పొంగి పొలాల్లోకి ప్రవహించింది. గ్రామం పరిధిలోని గడ్డం ధర్మారావు డ్రాప్ వద్ద కాలువ కట్టకు గండి ఏర్పడింది. సుమారు 50 ఎకరాలు నీటి మునిగాయి. ఇటీవల మరమ్మత్తుల్లో భాగంగా ముళ్ళ చెట్లు కాలువ రిపేరు చేసుకుని క్రమంలో ఇక్కడ గండి పడుతుందని రైతులు చెప్పినా సంబంధిత అధికారులు వినిపించుకోకుండా వదిలి వేసినట్లు, దాని పర్యవసానమే కాల్వకు గండి పడటానికి కారణమని గ్రామస్థులు చెబుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవడంలో ఎన్ఎస్పి అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడంతో కాల్వకు గండి బడిందని రైతులు ఆరోపిస్తున్నారు. గండి పడిన ప్రాంతాన్ని ఎన్ఎస్పి అధికారులు, సిబ్బంది పరిశీలించారు. నీటిని నిలిపి మరమ్మత్తులు చేస్తామని చెప్పారు. ఈ ఏడాది సీజన్ ఆలస్యమైన కారణంగా పైర్లు వేయకపోవడంతో రైతులకు ఎలాంటి నష్టం జరగలేదు. అయితే విషయమై కోనంకి ఎన్ఎస్పి డిఈ స్వామి మాట్లాడుతూ దగ్గుబాడు ఎన్ఎస్పీ కాల్వకు సమస్య ఏమీ లేదని, ఎగువ ప్రాంతంలో అధిక వర్షాల కారణంగా నీటి ఉధృతి పెరిగి నీరు పైకి వచ్చిందని ప్రజాశక్తికి చెప్పారు. దీనిపై రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేశామన్నారు.

దగ్గుబాడు వద్ద ఎన్‌ఎపి కాలువకు పడిన గండి

స్మార్ట్ ఫోన్ ఆవిష్కరిస్తున్న పద్మజ

గ్రంథాలయ భవన నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి - బాపట్ల

స్తానిక గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టర్ ఎం పద్మజ అన్నారు. గ్రంథాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో గ్రంథాలయం నూతన భవన నిర్మాణానికి సంబంధించిన అంశంపై గ్రంథాలయ పరిషత్ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. గ్రంథాలయానికి విచ్చేసిన ఆమె సమక్షంలో శిక్షణ ఫౌండేషన్ సంస్థ సౌజన్యంతో గ్రంథాలయానికి బహూకరించిన కంప్యూటరు, ఎల్ఈడి టివి, స్మార్ట్ ఫోన్‌ను ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి సుబ్బరత్నమ్మతో కలిసి ఆవిష్కరించారు. జిల్లాలో 15 గ్రంథాలయాలకు స్మార్ట్ ఫోన్లను స్వచ్ఛందంగా శిక్షణ ఫౌండేషన్ సంస్థ అందజేయడం అభినంద నీయమని అన్నారు. వీటిని వినియోగించుకుని గ్రంథాలయ అధికారులు విద్యార్థులు, మహిళలు, రైతులకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంగలకుదురు శివాజీ గణేశన్, శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు కార్తీక్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

బోడవాడలో నేత్ర దానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

పంగులూరు మండలంలోని బోదవాడకు చెందిన వజ్రాల వెంకటరెడ్డి (65) అనారోగ్యంతో చనిపోగా అతని కళ్ళను కుటుంబ సభ్యులు దానం చేశారు. గుంటూరు జిల్లా పెదకాకాని శంకర్ కంటి వైద్యశాల వైద్యులు వైద్యులు వచ్చి వెంకటరెడ్డి కంటి కార్నియా బుధవారం సేకరించారు. కుమారులు అంజయ్యరెడ్డి, శేషమ్మ, వీరాంజనేయరెడ్డి, అరుణ, రాజశేఖరరెడ్డి, అంబికా ఆధ్వర్యంలో కంటి కార్నియా సేకరించారు. రోటరీ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు మాట్లాడారు. నేత్ర దానం చేయడమంటే మరొకరికి కంటి చూపు ఇవ్వడమేనని అన్నారు. అవయువ దానంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యదర్శి అలవాల రాఘవరెడ్డి, అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహన్రావు, జెట్టి స్వామి అభినందించారు.

వజ్రాల వెంకటరెడ్డి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు మణిలాల్

సిఐటియు మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నిజాంపట్నం

సిఐటియు జిల్లా మహాసభల్లో భాగంగా సెప్టెంబర్ 27న జరిగే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభకు మండలంలో కార్మికులు, స్కీం వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ కోరారు. మండలంంలో నిజాంపట్నం, అడవులదీవి, కూచినపూడి, పల్లపట్ల గ్రామాల పరిధిలో ఆటో, ముఠా, అంగన్వాడి, ఆశ, ఐకెపి, విఒఎలను కలిసి సెప్టెంబర్ 27, 28 తేదీల్లో శ్రీ శుభంకర ఏలేట్‌లో జరుగనున్న సిఐటియు జిల్లా మహాసభల సందర్భంగా కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం కార్మిక సమస్యలపై పోరాటాల నిర్వహించే సిఐటియు భవిష్యత్ కార్యాచరణ కోసం జరుగుతున్న మహాసభలో కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె రమేష్, ఎన్ శివశంకర్, పి సురేష్, శకుంతల, ఉష పాల్గొన్నారు.

జమ్ము కాశ్మీర్‌లో జవాన్ మృతి

ప్రజాశక్తి - బాపట్ల

మృతుడు మద్దసాని గోపికృష్ణ

జమ్ము కాశ్మీర్‌లో ఆర్మీలో పనిచేస్తున్న మండలంలోని కంకటపాలెంకు చెందిన ఆర్మీ జవాన్ హవల్దార్ మద్దసాని గోపికృష్ణ విధి నిర్వహణలో బుధవారం మృతి చెందినట్లు మాజీ సైనిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. ఆర్మీ అధికారులు తెలియ చేసిన వివరాల ప్రకారం మద్దసాని గోపి కృష్ణ మృతదేహం గురువారం హైదరాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకొని మధ్యాహ్నానికి స్వగ్రామమైన కంకటపాలెంకు చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆర్మీ జవాన్ మృతిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. సమాచారాన్ని గుంటూరు సైనిక్ వెల్ఫేర్ అధికారులకు తెలియజేసిందని అన్నారు.

తహశీల్దారును సత్కరిస్తున్న టిడిపి నాయకులు

తహశీల్దారుకు అభినందనలు

ప్రజాశక్తి - వేటపాలెం

నూతనంగా తహశీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన గంగవరపు గీతారాణిని తెలుగుదేశం నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకులు బాలకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ప్రజలందరికీ సేవ చేసి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఇంటి స్థలాల కోసం నిరీక్షిస్తున్న పేదలకు త్వరగా స్థలం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు కీర్తి పూర్ణ, రాముడు, మహిళా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి, రవి యాదవ్, పులి హరికృష్ణ, ప్రత్తి పార్థసారథి, చైతన్య, వినోద్, తేజ, పేర్ల సుమన్, మణి, అనిల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో విద్యుత్తు టవర్లు నిర్మాణం జరుగుతున్న కారణంగా గురువారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రామానగర్ ఫీడర్ పరిధిలోని మార్కెట్ యార్డ్ వద్ద నుండి అన్నా కాంటీన్ వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం దామోదరం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి 5
గురువారం 25 సెప్టెంబర్ 2025

త్వరితగతిన ఈ-పంట నమోదు చేయాలి

మాట్లాడుతున్న జేసీ గోపాల కృష్ణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఈ- పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు.కలెక్టర్ సమావేశ మందిరంలో వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 15,68517 భూ కమతాలకు గాను 4,63071 మాత్రమే (30 శాతం) ఈ-పంట నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. నెలాఖరు లోపు నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారులందరూ గ్రామ వ్యవసాయ సహాయకులకు రోజుకు 100 కమతాలు చొప్పున లక్ష్యంగా నిర్దేసించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రోజూ సమీక్ష చేసుకుంటూ త్వరితగతిన మండలాలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని కోరారు. సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే సవరించాలని జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావును ఆదేశించారు. జిల్లా సరాసరి కన్నా తక్కువగా నమోదు చేసిన వ్యవసాయ అధికారులు కారణాలు చెప్పాలన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు వారి పరిధిలోని మండలాల లక్ష్యాలు పూర్తి చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి గోపీచంద్, ఉద్యానవన శాఖ అధికారులు గ్రామ సహాయకులు చేసిన రికార్డ్స్ ను ఆమోదించటంలో వెనుకబడి ఉన్నారని, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల అధికారులు చెప్పిన కొన్ని సమస్యలైన జియో ఫెన్సింగ్ 20 మీటర్ల నుంచి 100 మీటర్లకు పెంచితే బీడు కమతాలను తొందరగా పూర్తి చేయవచ్చన్నారు. అదేవిధంగా చివరి తేదీని అక్టోబర్ 15 వరకు పొడిగించాలనే విషయాన్ని రాష్ట్ర అధికారుల దష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. నల్ల బర్లీ పొగాకు సాగును కట్టడి చేయాలని ఆదేశించారు. యూరియా అందరికి అందుబాటులో ఉండేటట్లుగా చూడాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయం చేసే గ్రామాలలో వ్యవ సాయ అధికారులు సమన్వయంతో పని చేయాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం సుభాషిణి, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు గడువు పెంపు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : జవహర్ నవోదయ విద్యాలయంలో 9,11 తరగతుల్లో 2026-2027 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం దరఖాస్తు గడువు పెంచినట్లు విద్యాలయం ప్రిన్సిపల్ సి.శివరాం బుధవారం తెలిపారు. నవోదయ విద్యాలయ సమితి గడువు పెంచినట్లు ఆయన తెలిపారు. జిల్లా పరిధిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 8, 10 వ తరగతి చదివిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ లేదా అఫ్ లైన్ ద్వారా చేసుకోచ్చునని తెలిపారు. దరఖాస్తు ఫారాలు కావాల్సిన వారు జవహర్ నవోదయ విద్యాలయంలో పొందవచ్చన్నారు. దరఖాస్తు చేసు కొనేందుకు అక్టోబర్ 7 వరకూ గడువు ఉన్నట్లు తెలిపారు.

విద్యార్థులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలి

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ : సమాజ సేవలో భాగంగా విద్యార్థులు తప్పనిసరిగా సామాజిక బాధ్యత కలిగి ఉండాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డివిఆర్. మూర్తి తెలిపారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ సమావేశ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ద్వారా రక్తదానం, వైద్య శిబిరాలు, పచ్చదనం, నిరక్షరాస్యత నిర్మూలన, మహిళా చైతన్యం, జాతీయ సమైక్యత వంటి సేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నిర్మలామణి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో సంస్థ పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు,వాలంటీర్లు పాల్గొన్నారు

యూనివర్సిటీలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : ప్రకాశం జిల్లా వెనుక బాటుతనాన్ని తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేయాలని ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా మధు విజ్ఞప్తి చేశారు. 54 ఏళ్ల క్రితం (1970, ఫిబ్రవరి 2న) నెల్లూరు, కర్నూలు, గుంటూరు జిల్లాల నుంచి విడగొట్టి ఏర్పాటు చేసిన ప్రకాశం జిల్లాలో ఇప్పటికీ విశ్వవిద్యాలయం లేక వెనుకబడిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా స్థాపన అనంతరం ఎన్ని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా, అభివృద్ధి పరంగా ప్రకాశం జిల్లాకు సముచిత న్యాయం జరగలేదని పేర్కొన్నారు. గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి ఒంగోలు పీజీ సెంటర్‌ను స్టేట్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తామని చట్టం చేసినా అమలు లోకి రాలేదని గుర్తుచేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు సమిష్టిగా జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సి చర్యల గురించి మాట్లాడి నిధులు, అనుమతులు సాధించాలని కోరారు.

నేడు డిఎస్‌సి అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ

టీం లీడర్లకు సూచనలు చేస్తున్న డిఇఒ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

కాదేది కవితకు అనర్హం అన్నట్లుగా.. కాదేది ప్రచారానికి అనర్హంగా పాలకులు వ్యవహరిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా డిఎస్‌సి-2025 ద్వారా ప్రకాశం జిల్లాలో ఎంపికైన 879 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించే ప్రక్రియను పేర్కొనవచ్చు. సాధారణంగా ఏ ఉద్యోగ నియామకాలకైన ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థికి అపాయింట్మెంట్ ఆర్డర్ రిజిస్టర్ పోస్టు ద్వారానో, జిల్లా స్థాయి కౌన్సిలింగ్ చేపట్టినపుడో ఇస్తారు. లేదంటే ఏ స్థాయి ఉద్యోగం అయితే ఆ స్థాయిలో నియామక పత్రాలు ఇవ్వడం సహజం. ఆ ప్రక్రియను కూటమి ప్రభుత్వం బ్రేక్ చేసింది. దీన్ని ప్రభుత్వ ఖాతాలో కాకుండా కూటమి పార్టీల ఖాతాలో వేసే పద్ధతిలో 2025 డిఎస్‌కి ఎంపికైన అన్ని జిల్లాలకు చెందిన అభ్యర్థులను రాజధాని కి తరలించి వేడుకగా చేపట్టే దిశగా గత వారం అన్ని జిల్లాల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఆ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు రంగం సిద్ధం చేశారు. వాతావరణం అనుకులించక వాయిదా పడ్డ కార్యక్రమం గురువారం నిర్వహించడం కోసం విద్యా శాఖ అధికారులు మరోసారి సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా నుంచి 849 మంది అభ్యర్థులు, మరో 849 సహాయకులను తరలించడానికి విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

849 మంది అభ్యర్థులు 849 మంది సహాయకులు....

డిఎస్‌సికి ఎంపికై వారిలో జిల్లాలో ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్లు 661, జోనల్ స్థాయి ఉపాధ్యాయులు 189 కలిపి 849మంది, వారి సహాయకులు 849 మందిని కలిపి మొత్తం 1698 మందిని 43 ఆర్ టిసి బస్సుల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. 849 మంది అభ్యర్థులలో 591 పురుషులు, 258మంది మహిళలు ఉన్నారు. పురుషులు, వారి సహాయకులకు క్విస్ ఇంజనీరింగ్ కాలేజ్, మహిళలు వారి సహాయకులకు సెయింట్ జేవియర్స్, ఆగ్జేలియం స్కూల్, రామచంద్ర మిషన్ వద్ద బుధవారం రాత్రి బస ఏర్పాట్లు చేశారు. రాత్రికి భోజనం,గురువారం ఉదయం టిఫిన్ ఏర్పాట్లను ప్రభుత్వ యంత్రాంగం చూస్తుంది.ఈ నాలుగు కేంద్రాలలో ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు ఒంగోలు, మార్కాపురం డిప్యూటీ డిఇఒ చంద్రమౌళేశ్వరరావు, శ్రీనివాసులు, డిసిఇబి సెక్రటరీ మర్రి శ్రీనివాసరావు,ఎంఇఒ కిషోర్ బాబు, నలుగురు నోడల్ ఆఫీసర్లుగా నియమించారు.

ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించని వైనం

సాధారణంగా ప్రభుత్వం అధికారకంగా నిర్వహించే కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయిస్తుంది. డిఎస్‌సి నియామకపత్రాలు పంపిణీ కార్యక్రమం కోసం జిల్లాకు ముందుగా నిధులు కేటాయించలేదని సమాచారం. గత నెల లో రెండు రోజుల పాటు జరిగిన అభ్యర్థుల వెరిఫికేషన్ ప్రక్రియకు, ఆ తరువాత వారం పాటు చేపట్టిన రీ వెరిఫికేషన్ ప్రక్రియకు కూడా ప్రభుత్వం ముందస్తుగా రూపాయి బడ్జెట్ కేటాయించ లేదు. ఇలాంటి కార్యక్రమాలు తలపెట్టినపుడు ఆ మాత్రం మేనేజ్ చేయలేరా అనేమాట క్రింది స్థాయి నుంచి పై స్థాయి వరకు అలవాటుగా మారింది.పాలకులు వ్యవ హరిస్తున్న తీరు సమాజ హితం కంటే హాని తెచ్చేదిగా ఉందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలి

వినతి పత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

నగరంలోని వడ్డేవాని కుంట, సుందరయ్య కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి, పారిశుధ్య సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేసింది. గాంధీ నగర్ కమిటీ ఆధ్వర్యంలో 33వ డివిజన్ సచివాలయంలో అడ్మిన్ నాగేశ్వరరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్. బాబు మాట్లాడుతూ కాలనీలో 1వ లైన్ నుంచి 7వ లైన్ అడ్డ రోడ్డు వరకూ సైడ్ కాలువలు పూడికతో నిండిపోవడం వల్ల వర్షపు నీరు నిలిచి మురుగు చేరుతున్నట్లు తెలిపారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారన్నారు. వెంటనే సైడు కాలువల్లోని మురుగు తొలగించి ఫాగింగ్ చేపట్టాలన్నారు. గాంధీ నగర్, కొత్త డొంక, శివ ప్రసాద్ కాలనీలలోనూ పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకుడు ఎస్‌డి. హుస్సేన్, డివైఎఫ్ఐ నగర నాయకులు గురవయ్య, రామకష్ణ, సురేష్, రవి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బమ్మను సత్కరిస్తున్న డిపిఆర్ఒ కార్యాలయ సిబ్బంది

సుబ్బమ్మకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సమాచారశాఖలో 38 ఏళ్ల 6 నెలలకు పైగా విధులు నిర్వహించి ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ చేస్తున్న ఎసుబ్బమ్మను సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. టైపిస్టుగా, సీనియర్ అసిస్టెంట్‌గా నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో సుబ్బమ్మ సేవలు అందించారు. ఈ నేపథ్యంలో ఒంగోలు జిల్లా కార్యాలయంలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించి ఆమెతో కలిసి పనిచేసిన అనుభవాలను ఉద్యోగులు, సిబ్బంది గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు టి.కస్తూరిబాయి మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధతతో సుబ్బమ్మ పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఒ రమేష్, డివిజనల్ పిఆర్ఒ డి.దుర్గాప్రసాద్, డిఐపిఆర్ఒ, ఆర్‌జెడి, ఆర్ఐఇ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు.యూరియా కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలు, పిఏసిఎస్ కేంద్రాల ద్వారా యూరియాను తెచ్చుకోవచ్చునని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాలు, పిఏసిఎస్ కేంద్రాలు ద్వారా 256 మెట్రిక్ టన్నుల యూరియాను 2,466 మంది రైతులకు బుధవారం పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా 398 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. .

మాగుంటతో మాట్లాడుతున్న రఘుబాబు

మాగుంటను కలిసిన రఘుబాబు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డిని ప్రముఖ సినీనటుడు రఘుబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఒంగోలు వచ్చిన రఘుబాబు రాంనగర్ 2వ లైన్‌లోని ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు మాగుంటను కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు పలు విషయాల గురించి చర్చించుకున్నారు.

నిశ్చితార్థ వేడుకల్లో ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో బుధవారం నిర్వహించిన నిశ్చితార్థ వేడుకలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. ఒంగోలు దక్షిణ బైపాస్ రోడ్డులోని ఎస్‌జివిఎస్ కన్వెన్షన్ హాలులో కిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సిఒఒ కాకునూరు అంకిరెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, మాజీ ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, బాచిన చెంచుగరటయ్య నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అయినాబత్తిన ఘనశ్యామ్ తాతా ప్రసాద్, గోరెపాటి శ్రీనివాసరావు, ఆత్మకూరి బ్రహ్మయ్య,శ్రీనివాసరావు, రావుల పద్మజ పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి

- నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం పనులు పూర్తి
- ఒంగోలు సుందరీకరణకు ప్రతిపాదనలు
- అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి రాజాబాబు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగర కార్పోరేషన్ తోపాటు అన్ని మున్సిపాలిటీల్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడంలో ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి రాజాబాబు, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తన ఛాంబర్‌లో జెసి ఆర్ గోపాలకృష్ణ, ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ అధికారులు, పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీల కమిషనర్లతో సమావేశం అయ్యారు. అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్, డ్రైవేస్ట్ నిర్వహణపై కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పటిష్టంగా అమలయ్యేలా పనిచేయాలని అన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరంలోకి ప్రవేశించే ప్రదేశాన్ని పూర్తి స్థాయిలో సుందరంగా అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఒంగోలు కమిషనర్‌ను ఆదేశించారు. ఒంగోలు నగరంలో చేపట్టిన ప్రధాన కాలువల పూడికతీత పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో రూ.13.35కోట్లతో 96 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ పథకంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ ప్రత్యేక అధికారి ఆర్ గోపాల కృష్ణ వివరించారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా రానున్న సంవత్సరాల్లో పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా రూ.100కోట్ల ఆదాయం తెచ్చే విధంగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. సంతోషకరమైన నగరంగా తీర్చిదిద్దేలా దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె వెంకటేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఈఈ సంజయ్ కుమార్, అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

మాజీ మంత్రి బాలినేనితో వైసిపి నాయకులు

బాలినేనిని కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - సంతమాగులూరు

నియోజకవర్గంలోని జనసేన నాయకులు, జిల్లా కార్యదర్శి చల్లా వెంకట కృష్ణారావు ఒంగోలులో జనసేన నాయకులు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆయన నివాసంలో కలిసి బొకే అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సహకారంతో త్వరలోనే అన్ని మండలాల్లో పర్యటించి జనసేన బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గాదె రామాంజనేయులు, పలపోతు పూర్ణచంద్రరావు, మీరావలి, తోట కృష్ణ పాల్గొన్నారు.

శింగరకొండ పాలకవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - అద్దంకి

ఛైర్మన్ సుధాకరరావు

శ్రీ సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంకు పాలక మండలి ఏర్పాటుతో అనేక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానం పాలక మండల చైర్మన్ చుండూరి మురళి సుధాకర రావు, సభ్యులు ఆకుల కోటేశ్వరమ్మ, బత్తుల చంద్రశేఖర్, నూతి లక్ష్మీప్రసాద్, మద్ద సునీత, ఏల్చూరు వెంకటనారాయణమ్మ, ధూళిపాల వెంకటరత్నం, గొర్రెపాటి పద్మజ, అరబోలు నాగమ్మ, కోనంకి సుబ్బారావుతో పాటుగా దేవస్థానం ప్రధాన అర్చకులు కోటా లక్ష్మీనారాయణ ను ట్రస్టు బోర్డు సభ్యులుగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చారు.

వీరయ్యకు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్లపల్లికి చెందిన రిటైర్డ్ ఆర్పీఎఫ్ ఎఎస్ఐ పోలకం వీరయ్య (85) వయోభారంతో మృతి చెందగా ఆయన మృతదేహాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులు, బంధు మిత్రులు, గ్రామ ప్రజలు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం గ్రామ స్మశానవాటికలో అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, ఎఎంసి చైర్మన్ కౌతవరపు జనార్దనరావు, రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు హాజరయ్యారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వీరయ్య క్రమశిక్షణకు నిదర్శనం అన్నారు. సాధారణ ప్రజలతో కలిసిమెలిసి మెలిగిన వ్యక్తిని గుర్తు చేసుకున్నారు.


నియామక పత్రం అందుకుంటున్న డోలా శివకుమార్

బీసీ సంఘం ఉపాధ్యక్షుడిగా శివకుమార్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఐలవరం గ్రామానికి చెందిన పులిమి డోలా శివకుమార్ బుధవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో జిల్లాలోని భట్టిప్రోలు మండలం ఐలవరంకు చెందిన జగ్గారపు పాపారావు యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించారు. నియామక పత్రాలు రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు చేతుల మీదుగా అందుకున్నారు. యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షులు ఆరేపల్లి మహేష్, క్రాంతి కుమార్, టిడిపి ఐలవరం అధ్యక్షులు దీపాల శివప్రసాద్, పడవల గంగాధరరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - సంతమాగులూరు

అవగాహన కల్పిస్తున్న ఎడిఎ సుదర్శన్‌రాజు

డ్రోన్ టెక్నాలజీని రైతులు వినియోగించుకోవాలని మార్టూరు ఎడిఎ సుదర్శన్ రాజు తెలిపారు. మండలంలోని ఏల్చూరులో ప్రకాశం జిల్లా ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్‌తో నానో యూరియాను మాగాణి పొలాలపై పిచికారి ప్రయోగాత్మకంగా రైతులకు చూపించి అవగాహన కల్పించారు. ద్రవ జీవామృతం తయారీ విధానం తయారు చేసి చూపించారు. ద్రవ జీవామృతం తయారు చేసుకొని వాడకం వలన పంటలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. ఎఒ షేక్ సైద, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆత్మ సిబ్బంది రామిరెడ్డి, అక్షరరాణి, ప్రగతి, రామాంజనేయులు పాల్గొన్నారు.

అద్దంకి : మినుములో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మండలంలోని కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మినుములో రసం పీల్చు పురుగు నివారణకు ఇమిడా క్లోప్రిడ్ మందు పిచికారీ చేయాలని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. నానో యూరియా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎ సీత, ప్రత్యూష, ఎఇఒ కోటేశ్వరరావు, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, ఎఎంసి డైరెక్టర్ చింతా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విద్యతోపాటు సేవా దృక్పథం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

రక్తదాన శిబిరంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వ్యవసాయ సాంకేతిక విద్యతో పాటు విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చు కోవాలని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డిడి స్మిత్ అన్నారు. బుధవారం 57వ ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫారం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ పథకాన్ని 1969లో అప్పటి కేంద్ర విద్యా శాఖ మంత్రి డాక్టర్ కెవిఆర్వి రావు సెప్టెంబర్ 24న మహాత్మా గాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రారంభించారని అన్నారు. విద్యార్థి దశలోనే సేవా భావాన్ని అలవర్చుకొని వ్యవసా య రంగంలో అధిక దిగుబడుల సాధనకు రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సంద ర్భంగా ఏరియా వైద్యశాల డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 20మంది విద్యార్థులు, ముగ్గురు అధ్యాపక సిబ్బంది రక్త దానం చేశారు. జి రవిబాబు, కెవిఎస్ రామిరెడ్డి, బి .శ్రీనివాసులరెడ్డి, ఎస్ విష్ణువర్ధన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి విజయ్ కుమార్, ఎన్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని సూరవరపుపల్లి ఎంపిపి పాఠశాల (ఎస్‌సి) నందు పని చేస్తున్న ఎంవిఆర్ఎల్‌పి శారద ఎడ్యుకేషన్ సొసైటీ జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. ఆమెకు అవార్డును నేడు హైదరాబాద్‌లో స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ అవార్డు తన భాధ్యతను మరింత పెంచిందని అన్నారు. అవార్డుకు ఎంపికైన శారదను హెచ్ఎం వెంకటనారాయణ, శ్రీను, రామ తులసి, కొండమ్మ, ఎంఇఒ కార్యాలయం సిబ్బంది అభినందించారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ సేవా కార్యక్రమాల్లోల్లో పాల్గొనటం, ఆపద సమయాల్లో అవసరమైన వారికి ఆర్థిక సహాయం చేయటం వంటి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనటం అభినందనీయమని అన్నారు. ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇలాంటి సేవా కార్యక్రమాలు విస్తృత పర్చ ప్రతివిద్యార్థిని సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వామి అయ్యే విధంగా చ్కెతన్య వంతులను చేస్తామని తెలిపారు. తమ కళాశాల్లో ప్రతి ఏటా విధిగా రెండు సార్లు రక్తదాన శిభిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిసారి ఒక శిభిరంలో 100 మంది విద్యార్థులు రక్తదానం చేస్తున్నారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ దీవి జ్యోతి స్వరూప్ మాట్లాడుతూ గత 20ఏళ్లలో ఎన్ఎస్ఎస్ విభాగంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించటానికి సహకరించిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ సిఎస్ రావు, ఎస్కె మీరావలి, బి వినోద్ బాబు కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

పునరావాస కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పునరావాస కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - కొల్లూరు

ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా నదిలోకి 4.50 లక్షల క్యూసెక్కులు నీరు వదలడంతో ముందస్తు జాగ్రత్తగా కలెక్టర్ వినోద్ కుమార్ మండలంలో కొల్లూరులోని బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంను పరిశీలించారు. ఇలాంటివి 10 పునరాస కేంద్రాలు పరిశీలించి ఉంచాలని అధికారులను ఆదేశించారు. వరద ఉధృతి పెరిగితే సర్పంచులు, అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డిఓ రామలక్ష్మి, తహశీల్దారు బి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆనందబాబు

పాలకవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - వేమూరు

నియోజకవర్గంలోని కొల్లూరు మండలం దోనేపూడి పిఎసిఎస్ కార్యాలయంలో నూతన చైర్మన్ వెనిగళ్ల మహేష్, డైరెక్టర్లు వాక రెడ్డియ్య, యార్లగడ్డ శ్రీనివాసరావుచే శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సమక్షంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రైతులకు రూ.1.50 కోట్ల విలువైన సిసి రుణ చెక్కులు అధికారుల సమక్షంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన నూతన పాలకవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, గంగాధర్, మైనేని మురళీకృష్ణ, కనకాల మధుసూదన ప్రసాద్ పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ బి సంపూర్ణ సూచించారు. పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా తల్లిదండ్రులు, గర్భిణీ, బాలింతలకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకుకూరలు, రాగి పిండి, గోధుమ పిండి వంటి వాటితో రకరకాల ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చని అన్నారు. చిన్నారుల తల్లిదండ్రులకు, గర్భిణీలకు అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వ సరఫరా చేసే పోషక విలువలు కలిగిన పదార్థాలను ప్రతి ఒక్కరు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

ప్రజాశక్తి
గురువారం 25 సెప్టెంబర్ 2025

రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు యాక్షన్ ప్లాన్

ఎస్పి ఉమామహేశ్వర్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని ఎస్పీ బి ఉమామహేశ్వర్ తెలిపారు. కృష్ణా నదికి విడుదల చేసిన వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించేందుకు ఆయన మండలంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడే కంటే ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకునే ఉద్దేశంతో రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఎసిహెచ్‌ఓ, రైటర్, కంప్యూటర్, లాకప్, సిబ్బంది విశ్రాంతి, రికార్డ్స్ భద్రపరుచు గది, రిసెప్షన్ కౌంటర్, మహిళ హెల్ప్ డెస్కులను పరిశీలించారు. స్టేషన్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు పరిశీలించారు. పోలీసు సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎప్పటి నుండి స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారని, శాఖ పరంగా ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వృత్తిపట్ల నిబద్ధతతో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్ మ్యాప్‌ను పరిశీలిస్తూ ఏ ప్రదేశాల్లో ఏటువంటి నేరాల ఎక్కువగా జరిగాయని, వాటిని కట్టడి చేయడానికి ఆ ప్రాంతాల్లో తీసుకోవలసిన చర్యల గురించి అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు.

భట్టిప్రోలులో మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్

వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల గురించి తెలుసుకున్నారు. వరద ప్రవాహం పెరిగితే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షితమైన ప్రదేశాలకు వేగవంతంగా తరలించేందుకు సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ నెల 26, 27 తేదీల్లో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అన్నారు. కృష్ణానది ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంటుందనే సమాచారం మేరకు గత అనుభవాలు దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. రేపల్లె డిఎస్పి ఎ శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ జి నారాయణ, వేమూరు సిఐ పివి ఆంజనేయులు పాల్గొన్నారు.

కొల్లూరు : స్థానిక పోలీసు స్టేషన్‌ను ఎస్పీ బి ఉమామహేశ్వర్ బుధవారం తనిఖీ చేశారు. శాఖపరమైనసమస్యలు అడిగి తెలుసుకున్నారు. వృత్తి పట్ల నిబద్ధతతో ఉండాలని చెప్పారు. సమర్థవం తంగా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశిం చారు. సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్‌ను పరిశీలించారు. గతంలో భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె మండలాల్లో కృష్ణానది పరివాహక ప్రాంతాలు వరద ముంపుకు గురవడం జరిగిందని తెలిపారు. పరిమితికి మించి వేగంగా వాహనాలు నడపరాదని చెప్పారు. ఓవర్ లోడుతో వాహనాలు నడప రాదని అన్నారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు హెల్మెట్ ధరించాలని అన్నారు. దీని వలన మరణాలు తగ్గించవచ్చని అన్నారు. కార్యక్రమంలో రేపల్లె డిఎస్పి ఎ శ్రీనివాసరావు, ఎస్బిఐ ఇన్స్‌పెక్టర్ జి నారాయణ, వేమూరు సిఐ పివి ఆంజనేయులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : స్థానిక పోలీసు స్టేషన్‌ను ఎస్పీ ఉమామహేశ్వర్ బుధవారం తనిఖీ చేశారు. నూతనంగా జిల్లాకు వచ్చిన సాధారణ తనిఖీల్లో భాగంగా స్టేషన్ సందర్శించినట్లు తెలిపారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. జాతీయ రహదారి వెంబడి, ప్రధాన రహదారుల వెంబడి ప్రమాదాలు జరిగే ప్రదేశాలు గుర్తించి రహదారుల శాఖ అధికారులతో చర్చించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె డిఎస్పి శ్రీనివాసరావు, రేపల్లె రూరల్ సిఐ సురేష్ బాబు, ఎస్ఐ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవదిన వేడుకలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు సెయింట్ థెరిస్సా చర్చిలో నవదిన వేడుకలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో 3వ రోజు 'మోహ పాపాలు, మోహ తలంపులు చేయకపోవటం' అనే అంశంపై రెవరెండ్ ఫాదర్ బెర్నార్డ్ మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో పాపాలు, అన్యాయాలు, ఘోరాలు ఎక్కువ అయ్యాయని అన్నారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతనలో ఉండాలని అన్నారు. క్రీస్తు బోధనలను వింటూ మంచి మార్గాలు అనుసరించడం ద్వారా మంచి సమాజం నిర్మించుకోగలరని తెలిపారు. ఫాదర్ డిఎస్ పాల్, అసిస్టెంట్ ఫాదర్ హృదయ రాజు పాల్గొని దివ్య బలిపూజ నిర్వహించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో గోపాలనగరం, కమ్మపాలెం సంఘ పెద్దలు గాలి అంజనీ కుమారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉల్లాస్ కన్వీనర్ టి శ్రీనివాసరావు

అక్షర ఆంధ్రాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సంతమాగులూరు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన అక్షర ఆంధ్ర కార్యక్రమం చదువురాని పురుషులు, స్త్రీలు సద్వినియోగం చేసుకోవాలని ఉల్లాస్ కన్వీనర్, పర్యవేక్షకులు టి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఎంపిడిఒ జ్యోతిర్మయి అధ్యక్షతన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు ఒక్కరోజు శిక్షణ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనేక కారణాలతో పాఠశాలకు వెళ్లే వయసులో బడికి వెళ్లలేక, చదువుకునే వయసులో చదువుకు నోచుకోక ఉన్న వయోజనులకు ఈ పథకం ద్వారా విద్య నేర్చుకోవచ్చని అన్నారు. వయోజన విద్యా శాఖ ద్వారా మంత్రి లోకేష్ అక్షర ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఉల్లాస్ పథకం ద్వారా 15 నుండి 59 ఏళ్ల లోపు వయోజనులు విద్య నేర్చుకోవచ్చని అన్నారు. నచ్చిన సమయంలో ఉదయం 7 నుండి సాయంత్రం 8 వరకు చదువుకోవచ్చని అన్నారు. బోధన సామాగ్రిని ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. వయోజనులకు చదవడం, వ్రాయడం నేర్పించి వంద శాతం అక్షరాస్యత సాధించడమే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు. ఎపిఓ ఎం బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ అతి త్వరగా మ్యాపింగ్, ట్యాగింగ్ చేసి తరగతులు ప్రారంభిస్తామని అన్నారు. ఉపాధి హామీ కూలీలు చదువు నేర్చుకునే అవకాశం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఈసీ సురేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రకాశం బ్యారేజీ వద్ద దిగువకు నీటిని విడుదల చేయటంతో కృష్ణ నది కరకట్ట వెంట ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెనుమూడి కృష్ణానదిని సందర్శించి వరద ఉధృతిపై సమీక్షించారు. సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి వరద ముంపు గ్రామాలపై సూచనలు చేశారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది తక్షణ సహాయ చర్యల్లో భాగంగా సురక్షిత ప్రాంతాలు గుర్తించాలని చెప్పారు. సచివాలయ అధికారులు విధుల్లో అలసత్వంగా ఉండరాదని చెప్పారు. వరద ఉధృతి ఉన్న కారణంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. పెనుమూడి, పల్లెపాలెం, మైనేని వారిపాలెం, లక్ష్మీపురం, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ గ్రామాల్లో సిబ్బందిని ఏర్పాటు చేసి వరద ఉధృతిపై సమాచారాన్ని తీసుకుంటున్నామని అన్నారు. వరద

వరద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు శ్రీనివాసరావు

ప్రభావిత గ్రామాల్లో ప్రజలందరినీ పునరావాస కేంద్రానికి తరలించి అవసరమైన కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు పడవలపై చేపల వేట చేయటం ఈతకు వెళ్ళొద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంబాబు, ఎంపిడిఒ డివి రమేష్ బాబు, ఈఓపిఆర్డి ప్రసాద్ బాబు, విఆర్ఒ రవి, వెటర్నరీ డాక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

104 వైద్యసేవలపై ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పంగులూరు

104 సేవలను పల్నాడు రీజనల్ మేనేజర్ మహమ్మద్ ఖలీమ్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. నూజిల్లపల్లి చేరుకున్న ఆయన సిబ్బందితో వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. 104 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ విధివిధానాలు అడిగారు. సిబ్బంది ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు చేయాలని చెప్పారు. గ్రామాల్లో అనేక సమస్యలు ఉంటాయని, వాటిని అవగతం చేసుకొని, పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. విష జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా వంటి రోగాలను పరిశీలించాలని చెప్పారు. ప్రజలకు పారిశుద్ధ్యం వివరించాలని అన్నారు. ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించాలని కోరారు. డాక్టర్ బాల రాజేశ్వరి, డిఎం నాగేశ్వరరావు, ఓఇ అఖిల్ పాల్గొన్నారు.

అద్దంకి : భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పల్నాడు రీజనల్ మేనేజర్ మహ్మద్ ఖలీమ్ మండలంలోని సింగరకొండపాలెంలో 104 సర్వీసెస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వస్థ నారి శాసక్త పరివార్ అభియాన్ గురించి తెలుసుకున్నారు. 104 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ విధి విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీ హర్ష, డాక్టర్ జగదీష్, డిఎం నాగేశ్వరరావు, ఓఈ అఖిల్ పాల్గొన్నారు.

104 సిబ్బందితో పల్నాడు ఆర్ఎం మహమ్మద్ ఖలీమ్

పల్లెల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి

ప్రజాశక్తి - బాపట్ల

వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచి సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డివిజనల్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి చెరువు జమ్ముల పాలెంలో పారిశుధ్య నిర్వహణపై పరిశుద్ధ్య కార్మికులకు సూచనలు చేశారు. గృహాల నుండి సేకరించే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి ఇచ్చే విధంగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్లాస్టిక్ పూర్తిస్థాయిలో నివారించి గృహాల నుండి సేకరించే తడి చెత్త ద్వారా వర్మి కంపోస్ట్ పోస్టు వంటి ఎరువును తయారు చేసి చెత్త ద్వారా సంపద సృష్టించాలని అన్నారు. పరిశుద్ధ్య కార్మికులకు ప్రజలు సహకరించి చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకారం అవసరమని విజ్ఞప్తి చేశారు. క్లాప్ మిత్రలకు రక్షణ కిట్లను విజయలక్ష్మి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ, కార్యదర్శి జె మరియమ్మ పాల్గొన్నారు.



కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించిన రోటరీ ప్రతినిధులు

కెరియర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బిఎఆర్ అండ్ టిఎ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. రిటైర్డ్ ప్రొఫెసర్, రోటరీ అధ్యక్షులు డాక్టర్ బి వీరనారాయణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో అభ్యసించాలని చెప్పారు. సరైన రీతిలో ఎదగాలని చెప్పారు. మంచి భవిష్యత్తు అందుకోవాలని ఆకాంక్షించారు. ఇంటర్మీడియట్ తరువాత ఎవి కోర్సులు చదివి ఏ విధంగా తమ కెరీర్ కొనసాగించాలో వివరించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఆర్ రవి కుమార్, పాబోలు ఉదయభాస్కర్, తేళ్ల రమేష్ చంద్ర, పోలిశెట్టి చంద్రశేఖరరావు, కారుమూడి సుబ్బారెడ్డి, కోడూరి సుబ్రహ్మణ్యాచారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రేపల్లె ఎఒ ఎ మహేష్‌బాబు

జీవన ఎరువులు ఉపయోగించాలి

ప్రజాశక్తి - రేపల్లె

ద్రవరూప జీవన ఎరువులు ఉపయోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఎఒ ఎ మహేష్ బాబు పేర్కొన్నారు. మండలంలోని చాట్రగడ్డ, కామరాజుగడ్డ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి చౌడు పెరిగి సమతుల్యం దెబ్బతింటుందని, దాని వల్ల పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుందని అన్నారు. నేలలోని రసాయనిక మార్పుల వల్ల పంటకు మేలు చేసే సేంద్రియ కర్బన పదార్థం తగ్గడం వల్ల భూమికి మేలు చేసేందుకు సూక్ష్మజీవులు, వానపాముల సంతతి క్రమ క్రమంగా తగ్గి పంటలు దిగుబడి తగ్గడంతో రైతులు ఆదాయం కోల్పోతారని చెప్పారు. మోతాదుకు మించి ఎరువులు వాడటం వల్ల రైతు పెట్టుబడి ఖర్చులు పెరగడంతో పాటుగా నేల, నీరు, గాలి కాలుష్యం అవుతాయని, పంట ఉత్పత్తుల నాణ్యత దెబ్బతింటుందని అన్నారు. జీవన ఎరువులు వాడడం వల్ల రైతు పెట్టుబడి ఖర్చులు తగ్గే అవకాశం ఉందని అన్నారు.

యద్దనపూడిలో కురుస్తున్న జోరు వాన

యద్దనపూడిలో జోరు వాన

ప్రజాశక్తి - యద్దనపూడి

మండల కేంద్రమైన యద్దనపూడి, యనమదల, చింతపల్లిపాడు గ్రామాల్లో బుధవారం జోరు వాన కురిసింది. చీమటావారిపాలెం, జాగర్లమూడి, విజనంపాడు గ్రామాల్లో కొద్ది పాటి వర్షం కురిసింది. గత వారం 10 రోజులుగా ప్రతి రోజు వర్షం కురుస్తూనే ఉంది. కొన్ని పొలాల్లో వర్షపు నీళ్ళు నిలిచి ఉన్నాయి. శనగ వేయటం కోసం కొంత మంది రైతులు పొలాలు సిద్ధం చేసుకున్నారు. కొంతమంది పొలాలు దున్నుకోవాలి, బలం మందు చల్లుకోవాల్సి ఉంది. ప్రతి ఏటా ఏదోఒక విధంగా వర్షం ఎక్కువో తక్కువో పడడం వల్ల వ్యవసాయం లాభసాటిగా ఉండం లేదని యద్దనపూడికి చెందిన కౌలు రైతు శ్రీను చెప్పాడు. ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైసిపి నేతలకు బూచేపల్లి పరామర్శ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

వైసిపి సోషల్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఊదరగుడి విజయ్‌కుమార్ బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ స్థానిక వెంకటరమణ హాస్పిటల్ చికిత్స పొందుతున్నారు. ఈ విషయం గురించి తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి బుధవారం హాస్పిటల్‌కు వెళ్లి విజయ్‌కుమార్‌ను పరామర్శించారు. డాక్టర్ కామేపల్లి చంద్రశేఖర్‌తో మాట్లాడి విజయ్ కుమార్ ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఆర్థిక సాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో చేయి విరగడంతో శివప్రసాద్ రెడ్డి అదే ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతున్న స్టేట్ సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీ, నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన ఎస్. అనీల్‌కుమార్‌ను కూడా శివప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. పార్టీ తరపున అన్ని విధాల సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాసరావు, కష్టారెడ్డి, పలువురు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

అమెరికా ఆధిపత్యంపై ప్రచారోద్యమం

సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు

ప్రజాశక్తి- సింగరాయకొండ రూరల్

అమెరికా ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ చేపడుతున్న ప్రచార ఉద్యమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు పిలుపునిచ్చారు. అమెరికా ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి 30 వరకూ నిర్వహించనున్న ప్రచారోద్యమానికి సంబంధించిన కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం మన వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక ఉత్పత్తిని, సేవా రంగాన్ని దెబ్బతీస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుందన్నారు. ఉపాధి అవకాశాలు దెబ్బతిని విద్యార్థులు, యువత భవిష్యత్తు అగమ్యగోచర మవుతుందన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొని దేశ ప్రయోజనాలు కాపాడుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలను అంది పుచ్చుకోవాల్సిన మోడీ నేతృత్వం లోని బిజెపి ప్రభుత్వం ట్రంప్ అడుగులకు మడుగులొత్తే వైఖరిని ప్రదర్శిస్తోందన్నారు. రష్యా నుంచి ఆయిల్, ఆయుధాలు కొంటున్నామనే నెపం మోపుతూ ట్రంప్ మనదేశం పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ట్రంప్ వైఖరి వల్ల మన స్వతంత్ర విదేశాంగ విధానానికి, దేశ సార్వభౌమత్వానికి ముప్పు కలుగుతుందన్నారు. అమెరికా సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఉద్య మించాలన్నారు. మన దేశ ప్రజల ప్రయోజనాలు కాపాడే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ట్రంప్ టారిఫ్ టెర్రరిజంకు మోడీ లొంగుబాటు విధానంపై పోరాడదామన్నారు. ఇందుకోసం సిపిఎం చేపడుతున్న ప్రచారోద్యమానికి ప్రజలంతా మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్, జిల్లా కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, సీనియర్ నాయకులు ఎస్‌జతిరుపతి రెడ్డి, బిజె. రత్నం, పి.నరసింహులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు

జిల్లా స్థూల ఉత్పత్తి పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

స్వర్ణాంధ్ర సాధన లక్ష్యాలలో భాగంగా జిల్లా స్థూల ఉత్పత్తి పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. స్వర్ణాంధ్ర పి4 పర్మామెన్స్ ఇండికేటర్స్‌పై ప్రణాళిక శాఖ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం, ఆక్వా రంగాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. తలసరి ఆదాయంలో బాపట్ల జిల్లా 15వ స్థానంలో ఉందన్నారు. మూడో స్థానానికి చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. స్థూల ఉత్పత్తి పెరగడం ద్వారానే బాపట్ల జిల్లా అభివృద్ధి బాటలో పురోగతి సాధిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా అధికారులు కష్టపడి చిత్తశుద్ధితో పని చేయా లన్నారు. ప్రభుత్వ ఉద్దేశాలకు అనుగుణంగా 15శాతం వద్ధిరేటు సాధించాలన్నారు. బాపట్ల జిల్లా విజన్ ప్లాన్ పక్కాగా ఉండాలన్నారు. స్వర్ణాంధ్రలో నిర్దేశించిన ఐదు అంశాలలో వద్ధి సాధనకు చక్కని ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. జిల్లా స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ, ఆక్వారంగాలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయన్నారు. పాడి పరిశ్రమ, పారిశ్రామిక, నిర్మాణ రంగాలలో ఉత్పత్తి రంగం సింహభాగం పోషిస్తుందన్నారు. సేవల రంగాలలో రియల్ ఎస్టేట్ అదే స్థాయిలో ముందుకు వెళుతుందన్నారు. స్థూలంగా జిడిపిలో వ్యవసాయ అనుబంధ రంగాలు 58 శాతం వద్ధిరేటు సాధించినట్లు తెలిపారు. పారిశ్రామిక రంగం 13 శాతం, మిగిలినవి సేవా రంగాల పరిధిలో అభివృద్ధి వైపు నడుస్తున్నాయన్నారు. పురోగతి సాధించే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఒ షాలేమ్ రాజు, ప్రణాళిక విభాగం నిపుణులు పాల్గొన్నారు......

ప్రాణనష్టం జరగకుండా చూడాలి

కృష్ణా నదికి వరదల నేపథ్యంలో లంక గ్రామాల్లో ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ మత్స్యశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మత్స్యశాఖ అధికారులతో కలెక్టర్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల కారణంగా కష్ణానదిలో నీటి ప్రవాహ ఉధతి ఎక్కువగా ఉందన్నారు. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉందన్నారు. రాబోయే రెండు రోజుల్లో రెండవ ప్రమాద హెచ్చరిక రాబోయే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో లంక గ్రామాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ఇల్లు వదిలిపెట్టి రాని ప్రజలకు ఆహార పదార్థాలు అందజేయడం, వైద్య సేవల కోసం పడవలను సిద్ధంగా ఉంచాలన్నారు. వరద ముంపుకు గురయ్యే లంక గ్రామాలకు కొల్లూరు లాక్ ల వద్ద నుండి 8 గ్రామాలు, దోనేపూడి చప్టా నుంచి 3 గ్రామాలు, వెల్లటూరు నుంచి 7 గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, గ్రామాల్లో ఉండే వారికి భోజన సదుపాయాలు, వైద్య సేవలు కోసం మొత్తం 73 బోట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కష్ణా నదిలో రోజురోజుకు నీటి ప్రభావం పెరుగుతుందని అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు.కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రేపల్లె డివిజన్ పరిధిలోని కష్ణనది నీటి ప్రవాహం పై తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారులతో వీక్షణ సమావేశం ద్వారా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా నదిలో రోజురోజుకు నీటి ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా లోతట్టు ప్రాంతాలలోని ప్రజల ను సురక్షిత ప్రాంతంలో ఉండడానికి 25 రిహేబిటేషన్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రిహేబిటేషన్ కేంద్రాలకు డిఆర్‌డిఎ పిడి లవన్న ఇన్‌ఛార్జిగా ఉన్నారని తెలిపారు. రీహెబిటేషన్ కేంద్రానికి విఆర్ఓ, విఆర్ఎ, అంగన్‌వాడీ వర్కర్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలతో టీం వాట్సాప్ గ్రూప్ చేయాలని డిఆర్‌డిఎ పిడి ఆదేశించారు. త్రాగునీరు, మందులు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రేపల్లె ఆర్‌డిఒ రామలక్ష్మి, డిఆర్‌డిఎ పిడి లవన్న, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు జిల్లాలో విస్తతంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల నిర్వహణపై జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలే అభివద్ధికి పట్టుకొమ్మలు లాంటివని, వాటిని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శులపై ఉందన్నారు. పంచాయతీ శాఖ అధికారులు ఛాలెంజ్ గా పని చేయాలన్నారు. 461 పంచాయతీలు పరిశుభ్రతకు దర్పణంలా ఉండాలన్నారు. సుస్థిరాభివద్ధి లక్ష్యంతో యంత్రాంగం కలిసికట్టుగా పని చేయాలన్నారు. పంచాయతీ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లిప్తంగా ఉండరాదని సూచించారు. చెత్త సంపద కేంద్రాలను ఎంపిడిఒలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కారంచేడు, ఇంకొల్లు, అద్దంకి, రేపల్లె, వేటపాలెం మండలాలలో పారిశుధ్య కార్యక్రమాలు మరింత అధికంగా జరగాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, డిపిఒ ప్రభాకరరావు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

13 గంటల పని పట్ల

పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు 13 గంటల పని భారం పెంచే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడో డివిజన్ మాస్టర్ పాయింట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ ధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎనిమిది గంటల పని దినాలు కార్మికుల పోరాటాల ఫలితమని తెలిపారు. బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా మార్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా 13 గంటల పని విధానాన్ని అమలు చేయడం ద్రోహమన్నారు. రాత్రి షిఫ్టుల్లో మహిళలకు ఎక్కువ పని వేయడం మహిళ‌పై దాడులు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సిఐటియు నగర కన్వీనర్ టి. మహేష్ మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయకపోగా, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పని గంటలు పెంచుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నరసింహ,.రవణ,కోటేశ్వరి, ఏడుకొండలు, రమాదేవి, శ్రీను, సుకుమార్, సురేష్, మరియమ్మ , పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్‌పి బి.ఉమామహేశ్వర్ భరోసా కల్పించారు. సమస్యల పరిష్కారానికి ఎల్లవేళల సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు గత మే 20న గుండెపోటుతో మరణించారు. ఆయన సతీమణి సంతోష మాధురికి రూ.1 లక్ష అడిషనల్ కార్పస్ ఫండ్ చెక్కును ఎస్‌పి బుధవారం అందజేశారు. పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అలాంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఏదైనా సమస్య వచ్చినా, సహాయం కావాలన్నా తక్షణం స్పందించి సహాయం అందించడానికి పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఒ బి. సెక్షన్ సూపరింటెండెంట్ కె. రాధ, వెల్ఫేర్ ఆర్‌ఐ షేక్ మౌలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎస్‌పి ఉమామహేశ్వర్